

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

**ప్రియే ప్రాణేశ్వరీ, హృదయేశ్వరీ**

**యది, ఆప్ హమే ఆదేశ్ కరే, తో**

**ప్రేమ్ క హమ్ శ్రీ గణేశ్ కరే!**

'హమ్ తుమ్ ఔర్ వో' అనే సినిమాలో కిషోర్ కుమార్ తన స్వరంతో ప్రాణం పోసిన పాట ఇది. ఈ పాటను రచించింది వర్మ మాలిక్. సంగీతం రూపొందించింది కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ. వర్మ మాలిక్ హిందీ సినీ పరిశ్రమలో 1949 నుండీ ఉన్నా 1970లలో మనోజ్ కుమార్ సినిమాలతో పేరు సంపాదించాడు. అతని పాటలలో క్లిష్టమైన పదాలు ఉండవు. వినగానే ఆకర్షించే పదాలుంటాయి. ఆలోచింపచేసే భావాలుంటాయి.

'హమ్ తుమ్ ఔర్ వో' హాస్య ప్రధానమైన సస్పెన్స్ సినిమా. ఈ సినిమాలో నాయకుడు సంస్కృత లెక్చరర్. నాయక అతని విద్యార్థిని. ఆమెను ఆకర్షించి తనవైపు మళ్లేట్టు చేసుకునే సందర్భంలో ఈ పాటను పాడతాడు నాయకుడు. నాయకుడు సంస్కృత పండితుడు కావటంతో పాటలో సంస్కృత పదాలుండాలి. సంస్కృతం అధికంగా ఉంటుంది కాబట్టి పాట శాస్త్రీయ సంగీత ఆధారితమై ఉండాలి. అందుకే వర్మ మాలిక్ ఈ పాటను దాదాపుగా 90 శాతం సంస్కృత పదాలతోనే రచించాడు. ఇలా, దాదాపుగా 'సంసృతం పాట' అనదగిన స్థాయిలో ఉన్న ఏకైక హిందీ సినిమా పాట ఇది. సంస్కృత పదాలను అక్కడక్కడా హిందీ పదాలు వేసి కలిపాడు వర్మ మాలిక్. పల్లవిలో 'కరే, తో', ఆప్ హమే తప్ప మరో హిందీ పదాలు లేవు. ప్రియే, ప్రాణేశ్వరీ, హృదయేశ్వరీ, ఆదేశ్, ప్రేమ్, శ్రీ గణేశ్' అన్నీ సంసృత పదాలే. హిందీ వారికే కాదు దేశంలో అందరికీ సులభంగా అర్థమయ్యే పదాలే. 'ప్రాణేశ్వరీ, హృదయేశ్వరీ, నువ్వు ఆదేశం ఇస్తే నేను నిన్ను ప్రేమించటం ఆరంభిస్తాను'అంటున్నాడు నాయకుడు. ఏదైనా పని ఆరంభించేప్పుడు వినాయకుడిని ప్రార్థించటం సంప్రదాయం. దాంతో 'శ్రీ గణేశ్ కర్‌నా' అంటే పని ఆరంభించటం' అన్న అర్థం వస్తుంది.

సందర్భానికి తగ్గట్టు, సంస్కృత పదాలతో రాసిన పాటకు బాణీని కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ శాస్త్రీయ సంగీత రాగాలతో కూర్చాడు. భజన లాంటి బాణీ కుదిర్చి పాటలలో వాయిద్యాలన్నీ సాంప్రదాయకమైనవే వాడేదు. ఢోలక్, మంజీర, హార్మోనియం, ఖంజరి, తబలా వంటి వాయిద్యాలతో భీమపలాస్, పట్‌దీప్, యమన్ వంటి రాగాల కలయికతో ఉత్కృష్టమైన పద ప్రయోగాలతో ఉన్నతమైన పాటను రూపొందించారు కళ్యాణ్ జీ ఆనంద్ జీ.

**యే చక్షు తెరే చంచల్ చంచల్**

**యే కుంతల్ భీ శ్యామల్ శ్యామల్**

**యే అధర్ ధరే జీవన్ జ్వాలా**

**యే రూప్ చంద్ర శీతల్ శీతల్**

**ఓ కామినీ ఫ్రేమ్ విశేష్ కరే.**

సామాన్య భాషా పరిజ్ఞానం ఉన్న ప్రతి ఒక్కరికీ అతి సులభంగా పాట అర్ధమవుతుంది. సంస్కృత పదాల ప్రయోగం వల్ల ఒనగూడే ప్రయోజనం ఇది . భారతీయ భాషలను ఆర్య భాషలు, ద్రవిడ భాషలని కృత్రిమ అడ్డుగోడలు నిర్మించి విడగొట్టకముందు, భారతీయ భాషల జనని సంస్కృతం అని దేశ ప్రజలు నమ్మిన కాలంలో ప్రజలందరినీ కలిపింది సంస్కృత భాష. ప్రాంతీయ భాష తెలియకున్నా ప్రజలొకరితో మరొకరు సంభాషించే వీలు కలిగించింది సంస్కృతం. విశ్వనాథ సత్యనారాయణగారు వారణాసిలో తాను రామాయణ కల్పవృక్షం నుంచి కొన్ని పద్యాలు చదివినప్పుడు సభలో తెలుగు తెలియని వారు కూడా ఆ పద్యాలను అర్ధం చేసుకుని అభినందించారని చెప్పారొక చోట. కాబట్టి అతి సులభంగా అర్ధమవుతాయి ఈ పాటలో పదాలు, అవి ప్రదర్శించే భావం.

**హో సంచిత్ పుణ్యోంకీ ఆశా**

**సున్ వ్యధిత్ హృదయ్ కీ మృదు భాషా**

**సర్వస్వ సమర్పణ్ కర్ దే హమ్**

**కరో పూర్ణ హమారీ అభిలాషా**

## గజ్ గామినీ గాన విశేష్ కరే!

'సంచిత్ పుణ్యోంకీ ఆశా' పూర్వ జన్మలో చేసుకున్న పుణ్య ఫలం అన్న మాట ఆమె. వ్యధిత హృదయ భాషను వినమంటున్నాడు. ఆమెకు సర్వస్వం అర్పిస్తానంటున్నాడు. తన అభిలాషను పూర్తి చేయమంటున్నాడు.

**హమ్ భ్రమర్ నహీ ఇస్ యవ్వన్ కే**

**హం యాచక్ హై మన్ ఉపవన్ కే**

**హం భావ పుష్ప్ కర్ దే అర్పణ్**

**సాకార్ కరో సప్నే మన్ కీ**

**మన్‌మోహినీ మన్‌మే ప్రవేశ్ కరే...**

ఇది కూడా సులభంగా అర్థం అవుతుంది. నేను నీ యవ్వనం కోసం వెంటపడే తేనెటీగను కాను. నీ మనస్సును అర్థిస్తున్నాను. నా కలలను  సాకారం చేయమని వేడుకుంటున్నాడు. కిషోర్‌కుమార్ పాటలో ప్రతి పదాన్ని స్పష్టంగా ఉచ్చరిస్తూ, అక్కడక్కడా హాస్యంగా, వ్యంగ్యంగా, ఉచ్చరిస్తూ అత్యద్భుతంగా పాడాడు. కిషోర్ కుమార్ తప్ప మరెవరు పాడినా ఈ పాట ఇంతగా నచ్చేది కాదు.

కిశోర్ కుమార్, కళ్యాణ్ జీ-ఆనంద్ జీ ల నడుమ చాలా చక్కని స్నేహం వుండేది. తనకు నచ్చినట్టు బాణీ కట్టమని వారిని ఆదేశిస్తూండేవాడు కిశోర్ కుమార్. వారు అల్లరి చిల్లరి బాణీలే తనతో పాడిస్తున్నారని అలిగేవాడు. దెప్పి పొడిచేవాడు. అందుకే, కిశోర్ కుమార్ కోసం ప్రత్యేకంగా మృదు మధురమైన బాణీను కనీసం సినిమాలో ఒకటి వుండేట్టు చూసుకునేవారు కళ్యాణ్ జీ ఆనంద్ జీలు. పల్ పల్ దిల్ కే పాస్ తుమ్ రహెతీహో, మెరా జీవన్ కొరా కాగజ్, జిందగీ కా సఫర్, హై యె కైసా సఫర్ వంటి పాటలు కిశోర్ కుమార్ కోసమే ప్రత్యేకంగా రూపొందించినవి.

ప్రియే ప్రాణేశ్వరీ పాట అల్లరి చిల్లరి పాట.  సంస్కృతంలా అనిపించే శుద్ధ హిందీ పాటను హాస్య గీతంలా వాడుకోవటం గమనార్హం. 'చుప్కే చుప్కే' సినిమాలో ఓం ప్రకాశ్ పాత్ర  కూడా శుద్ధ హిందీ మాట్లాడే పాత్ర. శుద్ధ హిందీని ధర్మేంద్ర హేళన చేస్తూ ప్రవర్తిస్తాడు సినిమాలో. అంటే హిందీ సినిమాలలో శుద్ధ హిందీని హేళన చేసేందుకు, హాస్యం సృజించేందుకు వాడుకున్నారన్నమాట.

కానీ నవరంగ్‌లో భరత్ వ్యాస్ రచించిన పాట వింటూంటే అలాంటి భావన దరిదాపులకు కూడా రాదు. హేళన మాట అటుంచి శృంగార రస ప్రవాహం అనుభవానికి వస్తుంది. ఒక కళాకారుడి ఊహ, రూప రహితమైన బండను సుందర లావణ్య భరితమై సమ్మోహనవతి అయిన యువతిగా మలచటాన్ని అతి గొప్పగా ప్రదర్శిస్తుందీ పాట.

**శ్యామల్ శ్యామల్ బరన్, కోమల్ కోమల్ చరణ్**

**తెరే ముఖ్డే పే చందా గగన్ కా జడా**

**బడే మన్ సే విధాతా నే తుఝుకో ఘడా**

నాయికను నాయకుడు వర్ణిస్తున్నాడు. బరన్, జడా, ఘడా వంటి పదాలు తప్ప మిగతా పదాలన్నీ సులభంగా అర్థమైపోతాయి. ఘనశ్యామలుడు శ్రీకృష్ణుడు. శ్యామల రంగు. 'బరన్' అంటే 'రంగు' అని అర్థం, శ్యామలమైన రంగు శరీరానిది. కోమలమైన చరణాలు. ఆమె వదనంపై ఆకాశంలోని చంద్రుడు తిష్టవేసుకున్నాడు. విధాత ఎంతో ఇష్టంగా మనసు పెట్టి ఆమెను తయారు చేశాడు. ఇదీ వర్ణన. సాంప్రదాయకమైన వర్ణన.

పదాల వాడకంతో భావనకు ఊపు వచ్చింది .బరన్, చరణ్, జడా ఘడా వంటి పదాలతో ఒక అద్భుతమైన భావనను పల్లవి కలిగిస్తుంది. పదే పదే వినాలనిపిస్తుంది.

**తెరే బాలోమే సిమ్ టీ సావన్ కీ ఘటా**

**తెరే గాలో మే చిట్‌కీ పూనం కీ చ్ఛటా**

**తీఖే తీఖే నయన్, మీఠే మీఠే బయన్**

**తెరే అంగోం సే చంపాకా రంగ్ చఢా**

**బడే మన్ సే విధాతా నే తుఝ్ కో ఘడా**

పదాలలోని స్వచ్ఛత, మార్దవం , వర్ణన కలిగించే దృశ్య సౌందర్యాన్ని మరింతగా ఇనుమడింప చేస్తున్నది.

ఆమె కురులలో వర్ష ఋతువు నాటి మేఘం ఒదిగిందట. అంత నల్లగా ఉన్నాయి ఆమె కురులు ఊహ పాతదే. చెప్పిన విధానం కొత్తది.

'చిట్‌కీ' అతి తక్కువగా వాడే పదం హిందీ పాటలలో. 'ఛిట్‌కీ' అంటే చుక్కలు. ఛటా అంటే కాంతి పుంజం, రంగు అన్న అర్థాలు వస్తాయి. 'పూనం కే ఛటా' అంటే వెన్నెల రంగు. ఆమె కురులలో వెన్నెల వెలుగు చుక్కలు చుక్కలుగా ఉందట. అంటే అర్థం, ఆమె బుగ్గలు వెన్నెల రంగులో ఉన్నాయని 'తీఖీ  నయన్' అంటే, గర్వంతో ఇతరులందరినీ చులకనగా చూసే కళ్లు. ఆమె అందమైనదని ఆమెకు తెలుసు. అందరూ తన అందానికి దాసులని ఆమెకు తెలుసు. తనని చూసి మంత్ర ముగ్ధులయిపోవటం ఆమెకు అలవాటు .అందుకని ఒకరకమైన చులకన, ఆహంకారాలతో కూడిన చూపుతో ఉన్నాయి ఆమె కళ్లు. కానీ ఆమె మాటలు తీయనయినవి. ఆమె శరీరంలోని అంగాలలో సంపెంగ పువ్వు రంగు నిండింది. అందుకే దేవుడు ఎంతో శ్రద్ధతో మనసు పెట్టి నిన్ను రూపొందించాడు అంటున్నాడు ప్రియుడు.  పాటలో వర్ణనలలో కొత్తదనం లేదు. పదాల ప్రయోగం వల్ల పాట స్థాయి ఎదిగి 'అద్భుతం' అనిపిస్తుంది.

**యే ఉమర్, యే కమర్, సౌసా బల్ ఖా రహీ**

**తేరీ తిర్ఛీ నజీర్ తీర్ బర్సారహీ**

**నాజూక్ నాజూక్ బదన్, ధీమే ధీమే చలన్**

**తేరీ బాంకీ లటక్ మే హై జాదు బడా**

ఆమె యవ్వనాన్ని పొగుడుతున్నాడు ఇక్కడ. ఆమె నడుము పలు వయ్యారాలు పోతోందట. ఆమె వాడి అయిన చూపు బాణాలు విసురుతోందట, బాణాల వర్షం కురిపిస్తున్నదంటున్నాడు. నాజూకు అయిన శరీరం, మందగమనం, ఆమె కులుకుల్లో, వంపులు తిరిగిన జడలో మాయమంత్రాలేవో ఉన్నాయట. చక్కని పదాలతో కూడిన భావానికి అతి చక్కని సంగీతాన్ని సమకూర్చాడు సి. రామచంద్ర. లలిత లలిత పదాలకు లలితమైన బాణీ. అతి లలితమైన వాయిద్యాలు చేర్చటం వల్ల ఈ పాట ఇక మరపురాని మధురమైన పాటగా నిలిచిపోతుంది.

**కిస్ పారస్ సే సోనా యే టక్రాగయా**

**తుఝే రచకర్ చితేరా భీ చక్‌రాగయా**

**న్ ఇధర్ జాసజకా, న ఉధర్ జాసకా**

**రహగయా దేఖ్ తాహీ వో ఖడా హీ ఖడా**

**బడే మన్ సే విధాతా నే తుఝూ కో ఘడా**

'పారస్' అంటే tonch stone or philosopers stone.. మన పురాణాల ప్రకారం చింతామణీ రాయి. అది అత్యంత శక్తివంతమైనది. దాన్ని తాకితే బంగారంలా మారుస్తుంది. ఈ బంగారం ఏ 'పారస్'ను తాకింది ఇంత అందంగా మారింది అని ఆమెను రచించిన వాడే ఆశ్చర్యపోయాడట. ఆమెను వదిలి ఎటూ పోలేక సంభ్రమంతో నుంచుని ఆమెని చూస్తూనే ఉండిపోయాడట. ఆమె రచించిన చిత్రకారుడ్ని 'చితేరా' అని అచ్చ హిందీ పదం వాడేడు భరత్ వ్యాస్. ఈ పాట గొప్ప తనం భరత్ వ్యాస్ కూర్చిన పదాలలో వుంది. బాణీలో వుంది. పదాలు, నది నీరు వొడ్డు తిరిగే వంపులను అనుసరిస్తూ వంపులు తిరిగి ప్రవహించేట్టు బాణీని అనుసరిస్తూ పదాలు ప్రవహించటం పాటకు అందం చేకూరుస్తుంది. ముఖ్యంగా చరణాల చివరి పాదంలో పల్లవిని అందుకునేందుకు ఏర్పాటుచేసిన లింక్ వద్ద వాడిన పదాలు అద్భుతమైన భావనను కలిగిస్తాయి. బాణీ ఎంతగొప్పదయినా తగ్గ సాహిత్యం కుదరకపోతే, అందమైన శరీరమున్నా సరయిన ప్రవర్తన లేని వ్యక్తిలాంటిదవుతుంది పాట.

అత్యంత సంస్కారవంతమైన వర్ణనలతో, అతి చక్కని పదాలతో భావాల్ని వ్యక్తం చేయటంతో పాట వింటుంటే ఓ పవిత్రమైన భావన కలుగుతుంది.

'నవరంగ్' సినిమాలో నాయకుడు కవి. అతని భార్య సాధారణ అందగత్తె. మామూలు స్త్రీ. కానీ తన అసాధారణమైన సృజన శక్తితో నాయకుడు ఆమెను 'మనోహరమైన 'మోహిని'గా ఊహించి కవితలల్లుతూంటాడు. కళ్ల ఎదురుగా కనబడే భార్యకూ, అతడు ఊహించిన మోహినికి ఎంతగా తేడా ఉంటుందంటే అతని భార్య కూడా అతడు మరో అమ్మాయి మోహంలో పడ్డాడని భ్రమ పడుతుంది. ఒక ఉదాత్తమైన మానసిక స్థితికి అంతే ఉత్తమం, ఉన్నతమైన భావాలను ఉత్కృష్టమైన సాహిత్యంతో సృజించి ప్రదర్శించారు ఆనాటి కళాకారులు. ఇందుకోసం వారు సంపూర్ణంగా భారతీయ వర్ణన పద్ధతులను, సంవిధానాలను ఉపయోగించుకున్నారు . ఈ వర్ణనలలో ఎక్కడ కూడా పర్షియన్ కానీ ఆంగ్ల సాహిత్య ప్రభావం కానీ కనబడదు .

మరిన్ని మధురమైన పాటలతో వచ్చేనెల

Click here to share your comments